## ప్రభుత్వ వైద్యశాలకు కొత్త సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె. చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ




**తొలి సమయం. ఇల్లందు;జూలై, 23;**

ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె. చంద్రశేఖర్ (సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ ఆర్థోపెడిక్) గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ చంద్రశేఖర్‌కు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికి బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ వరుణ్ కుమార్, డాక్టర్ రామ్ నివాస్, డాక్టర్ సాయి చరిష్మాతో పాటు వైద్యశాలకు చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొని నూతన సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల హక్కుల పరిరక్షణకు అందరూ ముందుకు రావాలి: బానోత్ హరిప్రియ నాయక్

**తొలి సమయం, ఇల్లందు;జూలై, 23:**



విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు సమిష్టి కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. విద్యార్థుల హక్కుల సాధనలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 25న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లోని కమ్మవారి కళ్యాణ మండపంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఇల్లందు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మేధావులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బానోత్ హరిప్రియ నాయక్ విజ్ఞప్తి చేశారు.

## టీవీవీపీ ఆసుపత్రులకు కొత్త మెడికల్ సూపరింటెండెంట్లు

**- సీనియారిటీ ప్రాతిపదికన ముగ్గురు రెగ్యులర్ వైద్యుల నియామకం**




**తొలి సమయం, కొత్తగూడెం;జూలై, 23:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని పలు ఆసుపత్రులకు కొత్త మెడికల్ సూపరింటెండెంట్లను నియమిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రుల పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సీనియారిటీ ప్రాతిపదికన ముగ్గురు రెగ్యులర్ వైద్యులకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల నిర్వహించిన వైద్యుల రీ-డిప్లాయ్‌మెంట్ ప్రక్రియలో పలువురు రెగ్యులర్ వైద్యులు పాల్వంచ, ఇల్లందు, బూర్గంపాడు ఆసుపత్రులకు బదిలీ కావడంతో, ప్రస్తుతం ఆయా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సీనియర్ రెగ్యులర్ వైద్యులను మెడికల్ సూపరింటెండెంట్లుగా నియమించినట్లు అధికారులు తెలిపారు. నియామకాల ప్రకారం పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (పీడియాట్రిక్స్) డా. ఎం. ముక్కంటేశ్వరరావు, ఇల్లందు ఏరియా ఆసుపత్రికి సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (ఆర్థోపెడిక్స్) డా. కె. చంద్రశేఖర్, బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (అనస్థీషియా) డా. జి. ప్రసాద్ మెడికల్ సూపరింటెండెంట్లుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డా. జి. రవి బాబు మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన రెగ్యులర్ వైద్యులకు పరిపాలనా బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆసుపత్రుల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత మెరుగ్గా అందుతాయని తెలిపారు. నూతనంగా నియమితులైన మెడికల్ సూపరింటెండెంట్లకు అభినందనలు తెలిపిన డా. రవి బాబు, ఆయా ఆసుపత్రుల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పూర్తి సహకారం అందించి ఆసుపత్రుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## పాము కాటుతో యువకుడు మృతి

**తొలి సమయం తొర్రూరు 23 జూలై 2026**



తొర్రూరు మండలంలోని మడిపల్లి శివారు సోమవరపుకుంట తండాకు చెందిన బానోత్ ప్రవీణ్ (25) పాము కాటుకు గురై గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం రాత్రి భోజనం చేసిన అనంతరం ప్రవీణ్ ఇంటి ముందు ఏర్పాటు చేసిన రేకుల షెడ్ కింద నిద్రిస్తున్నాడు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో కట్ల పాము అతని కాలి మడమ సమీపంలో కాటు వేసింది. వెంటనే లేచిన ప్రవీణ్ కాటు వేసిన పామును చంపాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి వెళ్లి యాంటీ స్నేక్ వెనం () ఇంజక్షన్ వేయించుకోవాలని సూచించినప్పటికీ, ఏమీ కాదని భావించి ప్రవీణ్ నిర్లక్ష్యం చేశాడు. అనంతరం రాత్రి ఒంటిగంట సమయంలో వాంతులు, విరోచనాలు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే ప్రవీణ్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు చిన్న వయసులోనే తండ్రి బానోత్ లాల్ సింగ్‌ను కోల్పోయాడు. ప్రస్తుతం తల్లి బానోత్ రంగమ్మ, భార్య మమత, ఐదుగురు అక్కలు ఉన్నారు. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గమనిక: పాము కాటు వంటి ఘటనలు జరిగిన వెంటనే ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆసుపత్రికి వెళ్లి తక్షణ చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

# కురవి మండలం, కంచర్ల గూడెంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మిక పర్యటన

**తొలి సమయం మహబూబాబాద్ జూలై 23**





గ్రామంలో కొనసాగుతున్న సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ, ఆబాది రీసర్వే గ్రామకంఠం సర్వే, ఎస్జిటి ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ రికార్డులను పరిశీలించి జరుగుతున్న సర్వేపై సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారత్ ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాలో ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని అన్నారు క్షేత్రస్థాయిలో బిఎల్వో లు, ఎన్నికల విభాగం సిబ్బంది ప్రతి ఒక్కరికి ఎనమరేషన్ ఫార్మ్ పంపిణీ చేయడం జరిగిందని, అట్టి ఫారాలు పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందిస్తే ఆన్లైన్ డిజిటలైజేషన్ చేసి తమ ఓటును నిర్ధారణ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిలలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు,( బిఎల్ఏ ) లతో సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు, తద్వారా క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లు లేని ఓటరు జాబితా సిద్ధం అవుతుందని, అందు కోసం అధికారులు, పార్టీ ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయిలో ప్రత్యేక హెల్ప్ డెస్కులు, జిల్లాస్థాయి అధికారులను నియమించి అర్బన్ పరిధిలో పకడ్బందీగా ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు, జిల్లాలో రీ సర్వేకు ఎంపికైన (70) గ్రామాలలో (11) గ్రామాల గ్రామకంఠం, ఆబాది రీ సర్వే, పూర్తి చేయడం జరిగిందని ఈరోజు కంచర్ల గూడెంలో జరుగుతున్న సర్వే వివరాలను స్వయంగా పరిశీలించి అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డు శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వం సూచించిన ప్రకారం ఖచ్చితమైన సమాచారంతో క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. విద్యాశాఖ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే ఎస్జిటి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులలో ఆంగ్లభాష నైపుణ్యాలను పెంపొందించాలని, పాఠశాల స్థాయిలో విద్యార్థులందరూ మంచి నైపుణ్యాలను పెంపొందించే విధంగా , ఆంగ్ల భాషలో పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్నటువంటి ప్రతి అంశాన్ని విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడానికి తోడ్పడాలని దీనికోసం ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తన బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఉపాధ్యాయులచే నేర్చుకున్న అంశాలను వారి ద్వారా తెలుసుకోవడం జరిగింది ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సత్యనారాయణమూర్తి, డీఎస్ఓ అప్పారావు, ఎంఈఓ బాలాజీ, పాఠశాల హెచ్ఎం వాహిద్, ఆర్పీలు వెంకటేష్ శివప్రసాద్ శేఖర్ ఓంకార్ వెంకటేశ్వర్లు మరియు ఉపాధ్యాయులు, స్థానిక తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సిండికేట్‌పై మళ్లీ ఆరోపణలు.. వైన్ షాపుల్లో కొరత

**బెల్ట్ షాపుల్లో అందుబాటులో ప్రముఖ బ్రాండ్లు ఉన్నాయంటూ ప్రచారం**

**తొలి సమయం, ఇల్లందు;జులై, 23:**





ఇల్లందు పట్టణంలో మద్యం సిండికేట్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని మద్యం వ్యాపారంపై స్థానికంగా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఒక వర్గం ఆధీనంలో ఉన్న సిండికేట్ ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి అనుచరుల ఆధ్వర్యంలో కొనసాగుతోందనే ప్రచారం సాగుతోంది. స్థానికుల కథనం ప్రకారం, కొన్ని వైన్ షాపుల్లో ప్రముఖ బ్రాండ్లు అందుబాటులో లేవని వినియోగదారులకు చెబుతున్నప్పటికీ, అదే బ్రాండ్లు బెల్ట్ షాపుల్లో సులభంగా లభిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. పట్టణం నుంచి పరిసర గ్రామాలకు ప్రత్యేక వాహనాల ద్వారా మద్యం సరఫరా జరుగుతోందని, అధికారిక ధర కంటే ఒక్కో బాటిల్‌పై రూ. 30 నుంచి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపుల వ్యవస్థ యథేచ్ఛగా కొనసాగుతోందని, రాత్రి వేళల్లో వాటి వద్ద రద్దీ పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల వల్ల యువత మద్యం అలవాటుకు గురవుతున్నారని, కుటుంబాలపై ఆర్థిక, సామాజిక ప్రభావం పడుతోందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, మద్యం సరఫరా వ్యవస్థ కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందని, దీనివల్ల చిన్న వ్యాపారులు నష్టపోతున్నారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వైన్ షాపుల్లో స్టాక్ లేకపోయినా, అదే మద్యం బెల్ట్ షాపుల్లో ఎలా అందుబాటులోకి వస్తోందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిల్వలు, అనధికార సరఫరా, అధిక ధరల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు లేదా అధికారులు ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఆరోపణల నిజానిజాలు

# విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం..

**వర్షాకాల ఆరోగ్య జాగ్రత్తలు**

**ఎస్సై రాజ్‌కుమార్**






**తొలి సమయం కొత్తగూడ, 23 జూలై 2026**

కొత్తగూడ మండలంలోని కొత్తగూడ ఇంటర్ బాలుర వసతి గృహం, గోవిందాపురం బాలికల వసతి గృహాలను గురువారం కొత్తగూడ ఎస్సై రాజ్‌కుమార్ తన పోలీసు బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఎస్సై రాజ్‌కుమార్, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ పోషకాహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి ప్రతిరోజూ వ్యాయామం, యోగా, క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంచి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తాయని వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపైనా సమాన శ్రద్ధ చూపాలని, మంచి అలవాట్లు అలవరచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎస్సై రాజ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్‌లో బీఐఎస్ మెరుపు దాడులు..



**రూ.10 కోట్ల విలువైన హాల్‌మార్క్ లేని బంగారు ఆభరణాలు స్వాధీనం**

**తొలి సమయం వరంగల్, 23 జూలై 2026**

భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) హైదరాబాద్ శాఖ అధికారులు వరంగల్‌లోని ఓ ఆభరణాల దుకాణంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, హాల్‌మార్క్ లేని సుమారు రూ. 10 కోట్ల విలువైన 7.875 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బీఐఎస్ చట్టం2016, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధనలను ఉల్లంఘించిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. బీఐఎస్ హైదరాబాద్ శాఖ డైరెక్టర్, శాఖాధిపతి పి.వి. శ్రీకాంత్ ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్లు కె. కవిన్, విజయరాజ్ బర్బర్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. సోదాల సమయంలో నెక్లెస్ సెట్లు, గొలుసులు, ఉంగరాలు, చెవి దిద్దులు తదితర హాల్‌మార్క్ లేని బంగారు ఆభరణాలను విక్రయానికి ఉంచినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 10 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత ఆభరణాల వ్యాపార సంస్థపై బీఐఎస్ చట్టం2016 ప్రకారం చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బీఐఎస్ డైరెక్టర్ పి.వి. శ్రీకాంత్ మాట్లాడుతూ, తెలంగాణలో వరంగల్, హనుమకొండతో పాటు 13 జిల్లాల్లో బంగారు ఆభరణాలకు బీఐఎస్ హాల్‌మార్కింగ్ తప్పనిసరి అని తెలిపారు. స్వర్ణాభరణాల వ్యాపారులు కలిగిన బీఐఎస్ హాల్‌మార్క్ ఆభరణాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. వినియోగదారులు కూడా బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే ముందు వాటిపై బీఐఎస్ లోగో, స్వచ్ఛత గుర్తు , ఆరు అంకెల నంబర్ ఉన్నాయో లేదో పరిశీలించాలని, యాప్‌లో ను ధృవీకరించి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని కోరారు. హాల్‌మార్క్ దుర్వినియోగం లేదా లేని బంగారు ఆభరణాల విక్రయం ఎక్కడైనా గుర్తిస్తే మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని బీఐఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ, ఆభరణాల రంగంలో నాణ్యత, పారదర్శకత కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## 27 కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి: బోడ రమేష్ నాయక్



**తొలి సమయం, ఇల్లందు;జులై, 23:**

అక్రమ మైనింగ్‌కు సహకరిస్తున్నారంటూ జిల్లా మైనింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఇల్లందు మండలం ధర్మారం తండాలో సోమవారం నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం విజయవంతానికి నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ క్వారీలు కొనసాగుతున్నప్పటికీ జిల్లా మైనింగ్ అధికారి పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వచ్చి అక్రమ క్వారీలను సీజ్ చేసిన తర్వాత కూడా సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. సదరు అధికారిని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 27న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహా ముట్టడి కార్యక్రమానికి గిరిజనులు, యువత, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సేవాలాల్ సేన నాయకులు, గిరిజన యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ దారావత్ కాంతమ్మ సేవలు చిరస్మరణీయం

**- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు**

**తొలి సమయం, పోలారం;జూలై, 23:**

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పోలారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకురాలు కామ్రేడ్ దారావత్ కాంతమ్మకు గురువారం పుల్య తండాలో సంతాప సభ నిర్వహించారు. మండల కమిటీ సభ్యుడు మంగ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాంతమ్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ ఇల్లందు మండల కార్యదర్శి యాదలపల్లి సత్యం, పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మోతీలాల్, మండల కమిటీ సభ్యుడు దారావత్ రవి మాట్లాడుతూ, కాంతమ్మ దోపిడీ, అణచివేతలేని సమాజ నిర్మాణం కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. భూమి కోసం గిరిజనుల పోరాటాలు, నాటుసారా వ్యతిరేక ఉద్యమాలు, అజ్ఞాత దళాలకు సహకారం, గిరిజనుల హక్కుల పరిరక్షణలో ఆమె కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గ్రామంలో వైద్య సౌకర్యాలు లేని సమయంలో అనేక మంది మహిళలకు ప్రసవ సేవలు అందించి ప్రాణాలు కాపాడారని గుర్తు చేశారు. పార్టీ సభ్యురాలిగా, ప్రజాప్రతినిధిగా నిజాయితీతో సేవలందించిన కాంతమ్మ మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ సొరట్‌తో పాటు హర్జ్యా, రమేష్, మంగ్య, లక్ష్మ, కాంతమ్మ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దిన పత్రిక
తొలి సమయం

శుక్రవారం । 24 । జూలై । 2026

# ఏకలవ్య పాఠశాలలో కలకలం..

### ఆర్‌సీఓ ప్రవర్తనపై ప్రిన్సిపాల్ నుంచి వివరణ



**తొలి సమయం కొత్తగూడ 23 జూలై 2026**

కొత్తగూడ మండలం పోగుళ్లపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై అధికారులు స్పందించారు. పాఠశాలను సందర్శించిన ఆర్‌సీఓను విద్యార్థులు తమకు ఎదురవుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరిన సందర్భంగా, ఆమె విద్యా ర్థులతో అనుచితంగా ప్రవర్తించి, చెప్పుతో కొడతా అంటూ బెదిరింపులకు దిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారిణిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. వివాదాస్పద ఘటన నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ నుంచి పూర్తి వివరాలతో వివరణ కోరినట్లు సమాచారం. ఘటనపై సమగ్ర విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది.

# అత్యాధునిక జిల్లా పోలీస్ కార్యాలయం సిద్ధం..

## ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం



**తొలి సమయం మహబూబాబాద్, 23 జూలై 2026**

మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖకు నూతన హంగులు అద్దే అత్యాధునిక జిల్లా పోలీస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) డాక్టర్ శబరీష్ ఐపీఎస్ పర్యవేక్షణలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ భవనం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆధునిక సౌకర్యాలు, విశాలమైన నిర్మాణం, ప్రజలకు అనుకూలంగా రూపొందించిన విభాగాలతో ఈ కార్యాలయం తెలంగాణలోనే విశాలమైన జిల్లా పోలీస్ కార్యాల యాల్లో ఒకటిగా నిలవనుంది. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన పోలీసు సేవలను అందించాలనే లక్ష్యంతో కార్యాలయాన్ని అన్ని హంగులతో సిద్ధం చేశారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు ప్రస్తుతం తుది దశకు చేరుకోగా, త్వరలోనే ఈ నూతన జిల్లా పోలీస్ కార్యాలయం ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ కార్యాలయం ద్వారా పోలీసు సేవల నాణ్యత మరింత మెరుగుపడటంతో పాటు, ప్రజలకు సకాలంలో సేవలు అందే అవకాశం కలగనుంది.

# క్షేత్రస్థాయిలో వసతి గృహాల పర్యవేక్షణ, ఎస్ ఐ ఆర్ సవరణ, డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రత్యేక అధికారులు



**తొలి సమయం మహబూబాబాద్ జూలై 23**

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాలు మేరకు జిల్లాలో అన్ని వసతి గృహాల నిర్వహణ, సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రత్యేక అధికారులు సంబంధిత సిబ్బంది క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన వసతి గృహాలను తనిఖీ చేసి రికార్డులు, స్టోర్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, తరగతి గదులు, డైట్ మెనో తదితర అంశాలను పరిశీలించి, నివేదికలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, తదితర సంక్షేమ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారితో మాట్లాడుతూ ఉన్నారు, అర్బన్ పరిధిలో ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ పై జిల్లా స్థాయిలో అధికారులు సంబంధిత సిబ్బంది చేత నిర్వహించబడుతున్న, కార్యక్రమంలో భాగంగా ఉదయం, సాయంత్రం పోలింగ్ కేంద్రంలలో తనిఖీలు నిర్వహించి వేగంగా పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నారు, ఇందుకోసం జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మి నీ నియమించి క్షేత్రస్థాయిలో వసతి గృహాల తనిఖీలో సిబ్బంది పనితీరు పై సమీక్ష లు చేశారు

# పెబ్బేరు పిహెచ్సిలో కేజీబీవీ బాలికలకు హెచ్ పి వి వాక్సినేషన్



**తొలి సమయం పెబ్బేరు జులై 23**

ఈ రోజు పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కేజీబీవీ హాస్టల్ లో ఉన్న 14 సంవత్సరం నుండి 15 సంవత్సరంల లోపు బాలికలకు (29 మంది బాలికలకు) హెచ్ పి వి వ్యాక్సిన్ వేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి డాక్టర్ సుధారాణి మేడమ్ గారు, ఆర్.బి.ఎస్.కె డాక్టర్ .సునీల్ కుమార్ సార్ గారు మరియు మండల ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్ సార్ గారు, కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మ మేడమ్ గారు, పి హెచ్ ఎన్ లీలమ్మ, హెల్త్ సూపర్వైజర్ పార్వతి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, ఫార్మ్ ఆఫీసర్ కుమారి, ఏ ఎన్ ఎం మౌనిక, నాగలక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజారోగ్య రక్షణే ధ్యేయం: డాక్టర్ గుగులోతు రవి

### మరిపెడ పీహెచ్‌సీలో వైద్య అధికారుల కీలక సమీక్ష సమావేశం

**తొలి సమయంమహబూబాబాద్/మరిపెడ జూలై 23**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో అన్ని రకాల ఆరోగ్య కార్యక్రమాలపై ఈరోజు ఒక సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో దోమల ద్వారా, కలుషిత నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలను చైతన్యపరచాలన్నారు. సమావేశంలోని ముఖ్య నిర్ణయాలు సీజనల్ వ్యాధులపై అవగాహన: మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోధకాలు, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబలకుండా ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలి. వారానికి రెండు రోజులు డ్రై డే: ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు గ్రామస్థాయి అధికారులతో కలిసి ముమ్మరంగా డ్రై డే కార్యక్రమాలు చేపట్టాలి. వైద్య శిబిరాల నిర్వహణ: ముందస్తు ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ రూపొందించి అన్ని గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. హెచ్‌పీవీ వ్యాక్సిన్: 14–15 సంవత్సరాల వయసు గల బాలికలందరూ తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. కిశోర బాలికల పరీక్షలు: గ్రామాల్లోని కిశోర



బాలికలను గుర్తించి, వారికి అవసరమైన రక్త పరీక్షలు చేయాలి. నవదంపతుల సంరక్షణ: కొత్తగా వివాహమైన జంటలను గుర్తించి, వారిలో రక్తహీనత లోపాన్ని నివారించేందుకు సురక్షిత ప్రెగ్నెన్సీపై అవగాహన కల్పించాలి. టీబీ , దీర్ఘకాలిక వ్యాధుల స్క్రీనింగ్: క్షయ వ్యాధి నిర్ధారణ కొరకు స్ఫూటం (కఫం) శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపాలి. 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజిత, డాక్టర్ స్వామి, డాక్టర్ కిరణ్, పీహెచ్‌ఎన్‌ఓ మంగమ్మ, సూపర్‌వైజర్లు ఆచార్యులు, మాధవి, పల్లె దవాఖాన సిబ్బంది అఖిల, ఝాన్సీ, అనిత, సౌజన్య, సతీష్, ఉపేంద్ర, సరిత , ఏఎన్‌ఎంలు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు రుణాలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అమలు చేయాలి

### వివిధ బ్యాంకులు రైతులకు అండగా నిలవాలి

### సీపీఐ నాయకుడు ఎండి అబ్దుల్ రషీద్

**తొలి సమయం మహబూబాబాద్/మరిపెడ, జూలై 23:**

రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వివిధ బ్యాంకులు పంట రుణాలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానాన్ని అమలు చేసి, వడ్డీల్లో రాయితీలు కల్పించి రైతులకు ఉపశమనం కల్పించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని రైతులు వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాల భారంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం రెండు లక్షల రూపాయలలోపు పంట రుణాలను మాఫీ చేసిన నేపథ్యంలో, రెండు లక్షల రూపాయలకు పైబడిన రుణాలు కూడా మాఫీ అవుతాయనే ఆశతో చాలా మంది రైతులు తమ రుణాలను సకాలంలో చెల్లించలేకపోయారని చెప్పారు. అయితే, రుణమాఫీపై స్పష్టత లేకపోవడంతో అసలు రుణాలకు భారీ వడ్డీలు పేరుకుపోయి రైతులపై అదనపు ఆర్థిక భారం పడిందన్నారు. రుణ బకాయిల కారణంగా బ్యాంకులు రైతుల ఖాతాలపై హోల్డ్‌లు విధించడంతో రైతుబంధు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి ప్రభుత్వ పథకాల ద్వారా అందే పెట్టుబడి సాయం కూడా రైతులకు పూర్తిగా అందడం లేదని ఆవేదన వ్యక్తం



చేశారు. ఇప్పటికే ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, సాగు వ్యయాలు పెరగడం, పంటల దిగుబడులు తగ్గిపోవడం వంటి అనేక కారణాలతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించి రైతుల పంట రుణాలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అమలు చేయడంతో పాటు వడ్డీలలో రాయితీలు ప్రకటించాలని కోరారు. రైతులు ఒకేసారి మొత్తం బకాయిలను చెల్లించే స్థితిలో లేరని, అందువల్ల ప్రత్యేక విధానంతో విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పించాలని సూచించారు. ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాలు వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లక్ష్మణ్, వీరన్న, భగవత్, దీపక్, రాములు తదితరులు పాల్గొని రైతుల సమస్యలపై చర్చించారు. రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# తక్కువ నీటి పంటలు సాగు చేయాలి :అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్

**తొలి సమయం పెబ్బేరు జూలై 23**

పెబ్బేర్ మండలంలోని శాకాపూర్ గ్రామంలో ఎల్–నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు అనుసరించాల్సిన పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ మరియు సాగు విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్ కిమ్యా నాయక్ గారు రైతులకు ఎల్–నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందుననీటివినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్నితగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమం లో వ్యవసాయ శాఖ అధికారులు చక్రవర్తి, టీఆర్‌వీకే కోఆర్డినేటర్ శాస్త్రవేత్త నవత మేడం గారు, రైతులకు పెసర (గ్రీన్ గ్రామ్ ), మినుము (బ్లాక్ గ్రామ్ ), జొన్న (జోవార్ ), కంది (రెడ్ గ్రామ్ ) పంటల సాగు విధానాలు, విత్తనాల ఎంపిక, ఎరువుల యాజమాన్యం, పురుగు మరియు వ్యాధుల నివారణ చర్యల గురించి వివరించారు. అలాగే ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సాగు



పద్ధతులపై రైతులకు అవగాహనకల్పించారు. అదనంగా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, నేల ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ చర్యలు మరియు ఆధునిక సాగు సాంకేతికతలను రైతులు అవలంబించాలని సూచించారు. రైతులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) గారు ఎన్ కిమ్యా నాయక్, ఎంపీడీవో బి వెంకటేష్ గారు, గ్రామ సర్పంచ్ నికిత , ఉపసర్పంచ్ తిరుపతి ,సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నవీన్ మరియు ప్రజా ప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వర్షాభావంలో ప్రత్యామ్నాయ పంటలే రైతులకు రక్షణ



**తొలి సమయం కొత్తగూడ 23 జూలై 2026**

గూడూరు మండలంలోని లక్ష్మీపురం తండా గ్రామంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడి విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మలిక్ మాట్లాడుతూ, ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకుని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని అమలు చేయడం ద్వారా భూసారం పరిరక్షించబడటంతో పాటు దిగుబడులు, రైతుల ఆదాయం కూడా పెరుగుతాయని వివరించారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రభుత్వం సూచిస్తున్న వ్యవసాయ చర్యలు, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలు, సమగ్ర పంట నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు పెసర్లు, కందులు, మినుములు, బొబ్బర్లు, జొన్నలు వంటి తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మధు, గ్రామ సర్పంచ్ తేజావత్ శిరీష నరేశ్, ఉపసర్పంచ్ రమేష్, రైతులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు వేసుకోవాలి : డిప్యూటీ కలెక్టర్ రైతులకు సూచనలు



**తొలి సమయం శ్రీరంగాపూర్ జూలై 23**

వ్యవసాయ శాఖ వనపర్తి జిల్లా ఏలినినో ప్రభావం రైతు సోదరులకు సూచనలు వ్యవసాయ శాఖ రైతులసూచనల అగ్రికల్చర్ మరియు వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ సూచనల మేరకు ఒకే నీటిలో రెండు పంటలకుసాగు చేయ వచ్చు వర్షం ప్రభా పరిస్థితిలో ఒక పంట పంట విలమైన మరోఅంతర పంటల సాగు చెయ్యండి ఆదాయం పెంచండి ప్రమాదాన్ని తగ్గించండి అంతర పంటగా పుష్ప ధాన్యాల సాగు చేయడం వలన భూమిలో నత్రజని స్థిరత్వాన్నిజరిగి నేల సారవంతం పెరుగుతుంది కందులు మినుములు వంట పుష్పల వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరైన వనపర్తి జిల్లా అడిష నల్ కలెక్టర్ అగ్రికల్చర్ తెలంగాణ రైతు విజ్ఞానం కేంద్ర శాస్త్రవేత్త కోఆర్డినేటర్ నవత సూచించారు వనపర్తి జిల్లా సెక్రెటరీ రెడ్డి చర్ల శ్రీహరి రాజు శ్రీరాంగాపూర్ మండల్ అధ్యక్షులు విష్ణు పట్టణ అధ్యక్షులు గోవింద్‌టౌన్ ఉపాధ్యక్షుడు రామరాజువర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రయ్య మరియువార్డ్ నెంబర్ పశుల శేఖర్ రవి రాజా వర్ధన సుధాకర్ యాదగిరి లక్ష్మణ్ సంపత్ మరియు ఈ సదస్సులోరైతు సోదరులు పాల్గొనడం జరిగింది.

# గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి

**తొలి సమయంమహబూబాబాద్/సీరోల్ జులై 23**



మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం చింతపల్లి జడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ (గణితం)గా పనిచేస్తున్న వజ్ర కుమారి (45) గుండెపోటుతో మృతిచెందారు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెకు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతిపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

# కుమ్మరి వృత్తికి దక్కని తృప్తి

**తొలి సమయం, వనపర్తి జుల్తై 23**

సాంప్రదాయాన్ని వదులుకోలేక జీవనం కనుమరుగవుతున్న కుమ్మరి కుల వృత్తులు కుమ్మరి కళాకారుల అభ్యున్నతికి కృషి చేయాలి కుమ్మరి కళాకారుల సంఘం నాయకుడు శ్రీనివాస్ వెల్లడి తెలంగాణ రాష్ట్రంలో కుమ్మరి కుమ్మరి కళాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని కుమ్మరి కళాకారులకు గౌరవం దక్కే విధంగా కుమ్మరి కళ మన సంస్కృతి మన వారసత్వానికి నిదర్శనమని వనపర్తి కుమ్మరి కళాకారుల సంఘం నాయకుడు శ్రీనివాసులు అన్నారు. ఈ రాష్ట్రంలో కుమ్మరి శాలివాహన లేదా ప్రజాపతి కులస్తులు మట్టితో వివిధ రకాల కుండలు ప్రమిదలు ఇతర ఉపయోగకరమైన వస్తువులు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి కుమ్మరి కులవృత్తులు నేడు మచ్చుకైనా కనిపించకుండా కనుమరుగై పోతున్నాయని కుమ్మరి కుండలు తయారు చేసుకొని జీవిస్తున్న కులస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కులవృత్తికి దక్కని తృప్తి అన్న చందంగా కుమ్మరి కులస్తులు జీవనం కొనసాగిస్తున్నారు. వివిధ రకాల వస్తువులను తయారు చేస్తూ జీవనం చేసే ఈ కుల వృత్తులు ప్రకృతితో ముడిపడి ఉంటుంది. వీరు శాతవాహన రాజులను తమ పూరీకులుగా భావిస్తారు. సాంప్రదాయాన్ని వదులుకోలేక ఇప్పటికీ గ్రామాల్లో పట్టణాలలో కుమ్మరి కుండలు తయారు చేసుకొని చాలీచాలని బతుకులు జీవన విధానం కొనసాగిస్తున్నారు. మానవాళికి ఆహారాన్ని వంట చేసుకోవడానికి వంట పాత్రలు సమకూర్చి మానవజాతికి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించి ప్రజా ఆరోగ్యానికి పర్యావరణ పరిరక్షణకు ప్రతినిధిగా కుమ్మరి కులస్తులు కీలక పాత్ర పోషిస్తున్నారు. నేటి సమాజంలో అనేక రకాల ప్లాస్టిక్ వస్తువులు అందుబాటులోకి రావడం కుమ్మరి కులస్తుల కులవృత్తి రోజురోజుకు దిగజారిపోతుంది. భారత దేశంలో ఒక చరిత్ర కలిగిన మట్టి కుండలు నేడు కనిపించకుండాపోతున్నాయి. ఏ చిన్న శుభకార్యం జరిగిన కుమ్మరి కుండతో హిందూ సాంప్రదాయం ప్రకారం జరుపుకుంటున్న ప్రజలు పండుగలు శుభకార్యాలు పెళ్లిళ్లు, దశదినకర్మలు బోనాల పండుగ ఏది చూసినా కుమ్మరి కుండ లేనిది ముందుకు సాగడం లేదు. అయినప్పటికీ పెరుగుతున్న శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం మార్కెట్లో వివిధ రకాల రెడీమేడ్ వస్తువులు లభిస్తున్నాయి. దీనివల్ల కుమ్మరి వృత్తికి గండి పడింది. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర కుమ్మర సంఘం అనేక డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చిన కూడా పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గం గ్రామాలలో పట్టణాలలో కుండలకు ఉపయోగించే మట్టిని ప్రైవేట్ భూములలో ఉన్న వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి కుమ్మరి కులస్తులకు ఇవ్వాలని కుమ్మరి కుల సంఘం డిమాండ్ చేస్తుంది. అంతేకాక కుమ్మరి కుంటలు కాల్చడానికి వాము కోసం స్థలం కేటాయించాలని కుమ్మరి కుండలు అమ్మడానికి మార్కెట్లో షాప్స్ కేటాయించాలని అదేవిధంగా 50 సంవత్సరాలు దాటిన కుమ్మరి కులస్తులకు ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని కుమ్మరి కులస్తులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అంతరించిపోతున్న కులవృత్తులను కాపాడాలని ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించాలని వడ్డీ లేని రుణాల ద్వారా కుమ్మరి కులస్తులకు ఉపాధి చూపించాలని వనపర్తి జిల్లాకు చెందిన కుమ్మరి శాలివాహన సంఘం నాయకుడు కుమ్మరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అంతేకాక బిసి కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి వడ్డీ లేని రుణాలను ఇవ్వాలని రాష్ట్రంలో అన్ని మైసమ్మ పోచమ్మ ,జములమ్మ, సుంకులమ్మ, ఆలయాలలో పూజారులుగా కుమ్మరి కులస్తులను నియమించాలని ఆయన డిమాండ్





చేశారు. గ్రామీణ ప్రాంతాలలో కొన్ని సంవత్సరాల తరబడి కులవృత్తిని నమ్ముకొని కుండలు అమ్ముకొని జీవిస్తున్న కుమ్మర్ల జీవన విధానంలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదిక నా చర్యలు చేపట్టాలని కుమ్మరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

## వారాహి నవరాత్రి ఉత్సవాలకు వైభవంగా ముగింపు



**తొలి సమయం పెబ్బేరు జులై 23**

వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఉత్సవాల చివరి రోజైన తొమ్మిదో రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, అమ్మవారికి వేద మంత్రోచ్చారణల నడుమ విశేష అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి అనుగ్రహం కోసం వారాహి హోమం వైభవంగా నిర్వహించగా, హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. హోమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించి అమ్మవారిని ప్రార్థించారు. అలాగే సంప్రదాయబద్ధంగా ఒడి బియ్యం సమర్పణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించి కుటుంబాల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన వారాహి నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ విశేష పూజలు, అలంకరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల విశేష ఆదరణతో విజయవంతంగా జరిగాయని తెలిపారు. చివరి రోజు నిర్వహించిన కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడం విశేషంగా నిలిచిందన్నారు.

## నీట్ పరీక్ష పేపర్ లీక్ పై తొర్రూర్‌లో కాంగ్రెస్ నిరసన

- విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు






**తొలి సమయం-తొర్రూర్,జులై 23**

నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిని ఖండిస్తూ తొర్రూర్ మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు తొర్రూర్ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మార్కెట్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తొర్రూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోత్కూరి రవీంద్ర చారి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దసాని సురేష్, మున్సిపల్ అధ్యక్షులు తునం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే సంఘటనలను కాంగ్రెస్ పార్టీ సహించదు. నీట్ పరీక్ష పేపర్ లీక్ లపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల నిరసనలను అణచివేయకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది అని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు రక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, తొర్రూర్ ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, మండల, గ్రామాల నాయకులు, మున్సిపల్ అన్ని వార్డుల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ధర్నా రాస్తారోకో

- బీజేపీ మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి..చీకటి మహేష్ గౌడ్



**తొలి సమయం-దంతాలపల్లి జులై 23,**

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల వ్యవహార శైలికి నిరసనగా భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు మానుకోట జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ధర్నా, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ మాట్లాడుతూ..దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, రాజకీయ స్వార్థం కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం, పోలీసులపై దాడులు, మీడియా ప్రతినిధుల విధులకు ఆటంకం కలిగించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే విధంగా ఉన్నాయి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు డోర్నకల్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ తాడ పూర్ణచందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా మానుకోట జిల్లా అధ్యక్షులు దాసరి మురళి, దంతాలపల్లి మండల అధ్యక్షులు గుండగాని భరత్, చీకటి చిన్న మహేష్, అల్లం చంద్రశేఖర్, పోలోజి భీష్మ, కారు పోతుల ఉప్పలయ్య, వీరగాని రమేష్, చిన్నాల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డుపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్ నడిపితే చర్యలు తప్పవు




### యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు: పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్

**తొలి సమయం పెబ్బేరు జూలై 23**

కొత్తగా వేసిన బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ హెచ్చరించారు. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో మన రోడ్లను మనమే కాపాడుకుందాం.... కేజీ వీల్స్ తో రోడ్డు ప్రయాణం వల్ల జరిగే నష్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటీ రోడ్డుపై కేజ్‌వీల్స్ తో ట్రాక్టర్ నడపవద్దని సూచించారు. రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను నడపరాదని.. ఒకవేళ రోడ్డు మీదకు ట్రాక్టర్‌ను తీసుకు వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. బీటీ రోడ్లపై ట్రాక్టర్ కేజ్‌వీల్స్ తో నడిపితే రోడ్డు పగుళ్లుపోతుందని. అందరికీ, ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడే రోడ్డును పాడు చేసుకోవద్దన్నారు. ట్రాక్టర్ కేజ్‌వీల్స్ ను నడిపించవద్దని ఈ విషయంలో రైతులు ట్రాక్టర్ యజమానులు పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ఉంటే కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్‌పై తీసుకుపోయి అక్కడనే ఫిట్టింగ్ చేసుకుని వ్యవసాయ పనులు చేసుకోవాలని కోరారు. ట్రాక్టర్ యజమానులు ఇష్టారాజ్యంగా రోడ్లపై కేజ్‌వీల్స్‌ను నడిపిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే యువత మొబైల్ ఫోన్లకు బానిసలై తమ విలువైన భవిష్యత్తును పాడుచేసుకోవద్దని తెలిపారు. నేటియువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిసై వారి విలువైన జీవితాలను కోల్పోతున్నారనీ ఇది సరైంది కాదన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మం చి భవిష్యత్ ఉంటుందన్నారు. వాహనదారులు రో డ్డు భద్రత నియమాలు పాటించకుండా రాష్ డ్రై వింగ్‌చేస్తూ రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతూ కుటుంబాలను వీధీ పాలు చేస్తున్నారన్నారు. ప్రతి వా హనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటిం చాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరిం చి నడపాలని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వ వద్దని, మద్యం సేవించి ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దింటి నందీశ్వర్, వార్డు సభ్యులు పులెందర్ రెడ్డి, రవి సాగర్, సతీష్, దేవర్ల బీసుపల్లి, దాది రాముడు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కావలి బాలస్వామి, దారపోగు వెంకటేష్, ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, తిరుపతి రెడ్డి, వేణు గౌడ్, గడ్డం శేఖర్ మరియు పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

## కందికొండ క్రాస్‌రోడ్‌లో కాంగ్రెస్ నిరసన



### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

**తొలి సమయంమరిపెడ/కురవి, జూలై 23:**

ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ అగ్రనేతలు, విద్యార్థులపై జరిగిన అరెస్టులను నిరసిస్తూ గురువారం కురవి మండలం కందికొండ గ్రామ క్రాస్‌రోడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందికొండ గ్రామ సర్పంచ్ తుడుసు నాగార్జున మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ ప్రశ్నించే గొంతులను అణిచివేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. విద్యార్థులు తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే వారిపై లాఠీచార్జీలు, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యాని కి మాయని మచ్చ అని అన్నారు. విద్యా రంగానికి సంబంధిం చిన సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యతాయుతంగా వ్యవహరించకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తుందని, విద్యార్థుల హక్కులను కాలరాసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎల్‌నినో పరిస్తితులు , నర్సరీ చట్టంపై నర్సరీదారులకు అవగాహన




### స్వల్పకాలిక రకాలను, ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలి

**తొలి సమయం మహబూబాబాద్ , జూలై.23**

గురువారం కురవి మండలంలోని రైతు వేదికలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్త నర్సరీదారులకు ఎల్ నినో పరిస్థితులు మరియు నర్సరీ చట్టం పై ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ఎల్ నినో పరిస్తితులకు అనుగుణంగా స్వల్పకాలిక రకాలను ఎంచుకుని నారును నర్సరీలలో పలు మేలైన యాజమాన్య పద్ధతులు, సూచనలు, మరియు నర్సరీ నియమ నిబంధనలు పాటిస్తూ పెంచాలని, రైతుల అంగీకారం తెలిపిన రకాలను, పేరు గాంచిన రకాలను, వ్యవసాయ శాఖ ద్వారా ఆమోదం పొందిన రకాల నారును పెంచాలి. నర్సరీ చట్టం ప్రకారంనియమనిబంధనలుపాటించాలి. ఆరు బయట (ఓపెన్ ఫీల్డ్స్ లో) నారును పెంచవద్దని, నర్సరీ లైసెన్స్ లేకుండా నర్సరీ నుండి మిరప, కూరగాయలు మొదలైన నారు అమ్మవద్దు, కొనవద్దని నర్సరీ నియమ నిబంధనలు పాటించని వారిపై నకిలీ విత్తనాలు, నారు పోసిన వారిపై  పెట్టి జైలుకు పంపబడును, జరిమానా కూడా విధించబడునని అన్నారు. ఈ సందర్భంగా డా. ఎ. ప్రశాంత్, ప్రధాన శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన స్థానం, మల్యాల, ఎల్. సుహాసిని, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల, భూసార, నీటి పరీక్షలు, శాస్త్రీయ పరిశుభ్రత, కూరాగ్యల సాగు, పూల సాగు, నీటి ఎద్దడి, చీడ పీడలను తట్టుకునే రకాలు, షేడ్ నెట్స్, మల్చింగ్, భారతీయ ఉద్యాన పరిశోధన స్థానం వారు విడుదల చేసిన కూరగాయల రకాలు, పూల రకాలు, నిమ్మ గడ్డి సాగు వంటి పలు మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల పై సలహాలు సూచనలు ఇస్తూ పలు సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి రైతు పంట మార్పిడి చేసి ప్రతీ గ్రామంలో 50 ఎకరాలలో ఆయిల్ పామ్ తో పాటు అన్నీ రకాల ఉద్యాన పంటలను సాగు చేయాలని విజ్ఞప్తి. బోర్లు, బావుల క్రింద ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, మునగ, పూలు, మల్బరీ, పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేయాలి. ఉద్యాన శాఖ నుండి ప్లాస్టిక్ మల్చింగ్, బిందు సేద్యం, నీటి కుంటలు, కూరగాయల పందిర్లు పై పలు రాయితీలు ఇస్తుందని తెలిపారు. అభ్యుదయ రైతుల విజయ గాధలను సదరు రైతుల చే వివరించడం జరిగింది. ఎల్ నినో పరిస్థితులు దృష్ట్యా పంటల సాగు మరియు నర్సరీ మొక్కల నాణ్యత ప్రమాణాల పై కరపత్రాలను రైతుల అవగాహన కొరకు విడుదల చేయనైనది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ. శ్రీనివాస రావు, డా. ఎ. ప్రశాంత్, ప్రధాన శాస్త్రవేత్త, మల్యాల ఉద్యాన పరిశోధన స్థానం ఉద్యాన శాస్త్రవేత్త, ఎల్. సుహాసిని, కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల, ఉద్యాన అధికారులు ఆర్. శాంతి ప్రియ, ఎ. జె. శాంతి ప్రియదర్శిని, యం.స్రవంతి, మండల వ్యవసాయ అధికారి జి. నరసింహా రావు, విస్తరణ అధికారులు రాజేశ్వరి, విజయపాల్ రెడ్డి, రమేష్, నర్సరీదారులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి

- హౌసింగ్ డీఈ భూక్య రాజన్న



**తొలి సమయంమరిపెడ, జూలై 23:**

ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు హౌసింగ్ శాఖ తన వంతు కృషి చేస్తుందని హౌసింగ్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) భూక్య రాజన్న తెలిపారు. గురువారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో నిర్మించిన 26 మంది జర్నలిస్టుల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను, అలాగే హౌసింగ్ బోర్డు సమీపంలో నిర్మించిన 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను డీఈ భూక్య రాజన్న, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) కాటికల గోపి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ రాజన్న మాట్లాడుతూ, హౌసింగ్ పీడీ పురుషోత్తం ఆదేశాల మేరకు ఇళ్ల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించినట్లు తెలిపారు. ఇళ్లలో విద్యుత్ సౌకర్యం కల్పించే విషయంలో విద్యుత్ శాఖ నుంచి డిమాండ్ నోటీసు అందిన వెంటనే హౌసింగ్ శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుని విద్యుత్ కనెక్షన్లు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు చాలా కాలంగా ఖాళీగా ఉండటంతో కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు వీలైనంత త్వరగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుని ఇళ్లలో నివాసం ఉండాలని సూచించారు. ప్రజలు ఇళ్లను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. పరిశీలన సందర్భంగా ఇళ్ల నిర్మాణ నాణ్యత, పరిసరాల పరిస్థితి, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన అవసరంపై అధికారులు సమీక్షించారు. విద్యుత్ సమస్య పరిష్కారమైతే లబ్ధిదారులు ఇళ్లలో నివాసం ఉండేందుకు మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు, జర్నలిస్టులు, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణిలో భద్రతా పరికరాల కొరత.. కార్మికుల్లో ఆందోళన




**తొలిసమయం, కొత్తగూడెం జూలై 23 :**


సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అవసరమైన వ్యక్తిగత భద్రతా పరికరాలు (పీ.పీ.ఈ.) తగినంతగా అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పని స్వభావానికి అనుగుణమైన రక్షణ పరికరాలు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని వారు పేర్కొంటున్నారు. రోజువారీ విధుల్లో అవసరమయ్యే సాధారణ భద్రతా గ్లోవ్స్, ఇంపాక్ట్ గ్లోవ్స్, కట్-రెసిస్టెంట్ గ్లోవ్స్, ఎలక్ట్రికల్ ఇన్సులేటెడ్ గ్లోవ్స్, ఫుల్ బాడీ హార్నెస్‌లు (సేఫ్టీ బెల్ట్స్), సేఫ్టీ గ్లాసెస్, డస్ట్ మాస్కులు, ఎలక్ట్రికల్ సేఫ్టీ టూల్స్ వంటి పరికరాలు సరిపడా అందడం లేదని కార్మికులు తెలిపారు. సింగరేణిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా పరికరాల కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. పలుమార్లు యాజమాన్యానికి వినతిపత్రాలు అందించినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేదని ఆరోపించారు. కార్మికుల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి ఉద్యోగికి వారి విధులకు అనుగుణంగా అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని సింగరేణి యాజమాన్యాన్ని, సంబంధిత భద్రతా అధికారులను కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## ఏకలవ్య పాఠశాలలో కలకలం..

### ఆర్‌సీఓ ప్రవర్తనపై ప్రిన్సిపాల్ నుంచి వివరణ

**తొలి సమయం కొత్తగూడ 23 జూలై 2026**

కొత్తగూడ మండలం పోగుళ్లపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై అధికారులు స్పందించారు. పాఠశాలను సందర్శించిన ఆర్‌సీఓను విద్యా ర్థులు తమకు ఎదురవుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరిన సందర్భంగా, ఆమె విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించి, చెప్పుతో కొడతా అంటూ బెదిరింపులకు దిగినట్లు ఆరోప ణలు వెలువడ్డాయి. ఈ ఘటనపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారిణిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. వివాదాస్పద ఘటన నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ నుంచి పూర్తి వివరాలతో వివరణ కోరినట్లు సమాచారం. ఘటనపై సమగ్ర విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది.



దిన పత్రిక తొలి సమయం

శుక్రవారం । 24 । జూలై । 2026

# వాల్టా చట్టానికి తూట్లు..

# అర్ధరాత్రి తాడి చెట్లు విధ్వంసం..

**- అర్ధరాత్రి వేళ రంపాలతో తాళ్ల సంకీస తాటివనాన్ని అతి క్రూరంగా విధ్వంసం చేసిన రియల్ మాఫియా..**

**- పట్టాభూమితో పాటు ఇంకా కొంత చెరువుకట్ట పోరంబోకు భూమినీ మింగేసిన భూమాయగాళ్ళు.**

**- అధికారుల ఉదాసీనతపై అనుమానాలు..**

**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ జూలై 23:** రియల్ ఎస్టేట్ మాఫియా రెచ్చిపోతున్నారు. కాసుల కక్కుర్తి తో కబ్జా కల్చర్ పట్టణ కేంద్రాలకే పరిమితం అనుకుంటున్న పరిస్థితులకు భిన్నంగా పల్లెటూర్లకు కూడా పాకుతుంది, మాఫియా స్వార్థ రాక్షస ప్రయోజనం, వెర్రి తలలు వేస్తోంది, హైవేలు, మరియు రోడ్లకు ఇరువైపులా ఉన్న భూములపై వదలకుండా కన్ను వేస్తోంది, చెరువు, చెట్టు పుట్ట మట్టి గుట్టలు వదలకుండా పెట్రేగిపోతున్నారు. కనీసం వాల్టా చట్టం , ఇరిగేషన్ రెవెన్యూ అధికారులను క లెక్క చేయకుండా తాటి ఈత వనాలను విధ్వంసం చేస్తున్నారు. అనడానికి నిదర్శనం గా, ఏళ్ల తరబడి తాటి వనాన్ని జీవనాధారంగా బ్రతుకుతున్న మోదుగుల గూడెంగౌడ వృత్తిపై రియల్ ఎస్టేట్ విసిరిన దుర్మార్గ పంజా పై ప్రత్యేక కథనం.. వివరాల్లోకెళ్తే... మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం తాళ్ల సంకీసతాటి వనాన్ని కారణంగా నరికేసిన సంఘటన చోటు చేసుకుంది. ఒక్కసారి రెండవసారి కాదు మూడవసారి కూడా తాటి వనాన్ని అతి దారుణంగా నరికేసారని గౌడ్స్ వాపోతున్నారు.. మొదటి సారి సుమారు 200, రెండవసారి 30, మూడోసారి మరో 30 తాటి చెట్లను నేలకూల్చారు అని మోదుగుల గూడెం గౌడ్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. అయితే అర్ధరాత్రి అపరాత్రి వేళ రంపాలతో అక్రమ కూలీలను పెట్టి తాటి చెట్లను కూల్ చేస్తున్నారు.. గతంలో బాధ్యులపై కేసులు పెట్టారు, కేసులను లెక్కచేయ కుండా తిరిగి మళ్లీమళ్లీ అక్రమార్కులు తాటి చెట్ల విధ్వంసానికి పూనుకుంటున్నారు.. సుమారు 400 నుండి 500 తాటి చెట్లను కూల్చినట్లు బాధిత గౌడులు చెబుతున్నారు..

**చెరువు కట్టకు సమీప పోరంబోకు భూమిని కాజేశారు..**

రోడ్డుకు ప్రక్కన ఉన్న పట్టా భూమికి చెరువు కట్టకు ఆనుకొని ఉన్న పోరంబోకు భూమిని భూమిని, మత్తడిని పూడ్చివేసి ఆ భూమిని పట్టాభూమిని కలిపేసుకున్నారు.చెరువు భూమిని కలిపేసుకున్నా, మత్తడిని పూడ్చేసి. గౌడ్స్ నడిచే రహదారిని పూడ్చేసినా, బాధిత గౌడ్స్ గగ్గోలు పెట్టినా అధికారులు చర్యలు తీసుకోవడంలో ఉదాసీనత వహిస్తున్నారని, గౌడ్స్ నుండి మరియు ప్రకృతి పర్యావరణ ప్రేమికుల నుండి బలమైన ఆరోపణలు వినపడుతున్నాయి కనుక జిల్లా అధికారులు , వోల్టా చట్టాన్ని కనీసం లెక్కచేయకుండా.. చెరువు భూమిని మరియు తాటి వనాలను రాత్రికి రాత్రి నరికివేసిన రియాల్టర్లపై వెంటనే చర్యలు తీసుకొని, భవిష్యత్తు తరాలకోసం చెరువులను ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడాలని కోరుకుంటున్నాను..

